
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# -55-
# అనుకోని గుర్తింపు -అవసరమా?

**అప్పుడప్పుడు "ఓ రాయి వేస్తే పోలే?"** అనిపించి అలా వేశాం అనుకోండి. దాని అర్థం మనకి తెలిసినదే. ఆ రాయి తగల వలసిన చోట తగిలితే సరే. తగలక పోయినా మనకి వచ్చిన నష్టం ఏమీ ఉండదు. ఇప్పుడు ఆ పోలిక సరి అయినదో కాదో తెలియదు కానీ, ఇది చదివాక ఎవరికైనా కోపం వస్తుందేమో అంతకన్నా తెలియదు కానీ, ఇది సభా మర్యాదకీ భారత ప్రభుత్వానికీ నేను ఏమైనా భంగం కలిగిస్తున్నానేమో అంత కన్నా తెలియదు కానీ అందరూ పెద్ద మనసుతో నన్ను మన్నించమని కోరుకుంటున్నాను.

అసలు ఏమయిందీ అంటే సరిగ్గా మూడు, నాలుగు వారాల క్రితం నేను మన న్యూ ఢిల్లీ లో ఉన్న ఉపరాష్ట్రపతి గారికి ఒక  గాలి రాయి ..అంటే ఇమెయిల్ లో ఒక చిన్న రాయి విసిరాను. అంటే "ఓ రాయి వేస్తే పోలే?" అన్న బాపతు అనమాట. అదెందుకూ అంటే సరిగ్గా గత ఏడాది ..అంటే అక్టోబర్ 10-11, 2020 లో మేము..అనగా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, శ్రీ సాంస్కృతిక కళా సారధి (సింగపూర్), తెలుగు మల్లి (ఆస్ట్రేలియా), ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగు సమాఖ్య (ఇంగ్లండ్), దక్షిణ ఆఫ్రికా తెలుగు సాహిత్య వేదిక (జొహానెస్ బర్గ్) సంస్థల సహకారంతో నిర్వహించిన 7వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు లో 5 ఖండాల నుంచి 14 దేశాల నుంచి సుమారు 200 మంది వక్తలు పాల్గొన్న, 36 గంటల సేపు  నిర్విరామగా జరిగిందొచ్ అని మేము నిర్విరామంగా ప్రచారం చేసుకున్నాం.  ఇదేదో బావుందే అని అలాంటి స్లోగన్ ని,,అంటే 5 ఖండాల నుంచి యాభై రెండో, డభై నాలుగో దేశాల నుంచి నూట నలభై తెలుగు సంఘాలు, ఆ చిత్రగుప్తుడు కూడా లెక్కపెట్ట లేనంతమంది వక్తలు పాల్గొంటున్న....అని ప్రపంచంలో సాహిత్యానికి "మాసికాలు" పెట్టే వారందరూ వాళ్ళ లెవెల్ పెంచేసుకున్నారు.

ఇప్పుడు జరిగింది ఏమిటంటే ....ఆ 7వ ప్రపంచ సదస్సులో పాల్గొన్న వక్తలు అందరినీ బతిమాలి, బెదిరించి, కోప్పడి, సాష్టాంగ నమస్కారాలు చేసి, ... వారి ప్రసంగ వ్యాసాలు తెప్పించుకుని,..అలా చేతి వ్రాత, పిడిఎఫ్, జేపెగ్ ..ఇలా అడ్డమైన సాంకేతిక ప్రక్రియలలోనూ వచ్చిన వాటిని గూబ వాచేటంత..డబ్బులు ఖర్చు పెట్టి టైపింగ్ చేయించి, అందరి

ఫోటోలూ వారి వారి ముఖార విందాలు ఎలా ఉన్నప్పటికీ వాటిని సర్వాంగ సుందరంగా రంగులలో వేయించి మొత్తానికి 520 పేజీల సభా విశేష సంచిక ముద్రణకి తయారు చేశాం. అంతేనా అంటే అంతే కాదు. అనుకోకుండా....ఈ పుస్తకం మా 100వ ప్రచురణగా లెక్క లోకి వచ్చింది. అబ్బో వంద పుస్తకాలే..అనిపించగానే కాస్త పరిశోధన చేస్తే....భారత దేశం ఎల్లలు దాటి విదేశాలలో అన్ని పుస్తకాలు ముద్రించినది బహుశా మేమేనేమో అనే అనుమానం వచ్చేసింది. నాకు తెలిసీ వెబ్ పుస్తకాలు చాలా ప్రచురించిన వారిలో కౌముదిదే అగ్ర తాంబూలం. నేను చెప్పేది అచ్చు వేసినవి అనమాట. ఈ ప్రత్యేకతలే కాక, మా పుస్తక ప్రచురణల విషయంలో డిటీపీ, రూప కల్పన, ముద్రణ, పంపిణీ మొదలైన అన్ని విషయాల లోనూ మాకు చేదోడు వాదోడు గా ఉన్న శ్రీమతి జ్యోతి వలబోజు సంస్థ జే.వి పబ్లిషర్స్ కి ఇది 200 వ ప్రచురణ అని కూడా తెలిసింది. అంటే ఈ పుస్తకం వంగూరి 100 – వలబోజు 200 అనమాట.

మరి ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఈ గ్రంథం ఆవిష్కరణ కూడా ప్రత్యేకంగానే ఉండాలి కదా!. అంచేత ఆ నాటి 7వ సదస్సు ప్రధాన నిర్వాహకులైన ఆత్మీయులు రత్న కుమార్ కవుటూరు, రాధిక మంగిపూడి (సింగపూర్), రావు కొంచాడ (మెల్ బర్న్), వంశీ రామరాజు గారు (హైదరాబాద్), డా. జొన్నలగెడ్డ మూర్తి (ఇంగ్లండ్), రాపోలు సీతారామరాజు (జొహాన్స్ బర్గ్), మా హ్యూస్టన్ వాడే అయిన శాయి రాచకొండ, మా ప్రధాన సాంకేతిక నిపుణులు రాధాకృష్ణ గణేశ్న లని సంప్రదించాను. ఆ నాటి వక్తలనీ, ప్రసంగ వేదికల నిర్వాహకులనీ, సాంకేతిక నిపుణులనీ పిలిచి అంతర్జాలంలో ఆవిష్కరణ మహోత్సవం నిర్వహించాలని అందరూ ఏకగ్రీవంగా నిర్ణయించేశారు. ఇక ఆవిష్కర్తగా ఎవరు ఉంటే బావుంటుందీ అనే అంశం మీద రకరకాల సూచనలు వచ్చాక ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారి పేరు తెర మీదకి వచ్చింది. ఈ మధ్య ఆయన చాలా సభలకి వచ్చి తెలుగు భాష పురోగమించవలసిన అవసరం మీద మాట్లాడుతున్నారు కాబట్టి ఫలానా వాళ్ళ చేత సిఫారస్ చేయిస్తే ఆయన వస్తారు అని ప్రతిపాదనలు వచ్చాయి. ..అంటే వెంకయ్య నాయుడు గారి చేత ఒప్పించడానికి రికమండేషన్ చేసే వాళ్ళ పేర్లు నాలుగైదు వినపడ్డాయి. “అలా సిఫారసులూ, రికమండేషన్లూ నై జాంతా. మన సంస్థ గురించీ, 100 వ పుస్తకం గా దీని ప్రత్యేకతా ఆయన గుర్తించి అంగీకరిస్తే దానికి విలువ ఉంటుంది. అంచేత నేనే ఆయనకి ఒక రాయి విసురుతాను. తగిలితే మంచిదే” అని నేను ఉపరాష్ట్రపతి గారి ఈమెయిలుకి ఒక రాయి విసిరాను. అలా అని పాలోమని గొప్ప గొప్ప వాళ్ళతో నా ఫోటోల తోటీ, పేద్ద బండ రాయి కాదు. చిన్న రాయి. అంటే కేవలం ఒకే ఒక పేజీ అనమాట. అయితే నేను ఊహించని విధంగా ఆయన ఆఫీస్ నించి “పుస్తకం కాపీలు పంపించమన్నారు” అని వార్త రావడం, ఆదరాబాదరాగా కొన్ని కాపీలు ముద్రించి ఆయనకీ అందించడం, అది ఆయన చూసి అంగీకరించడం, ఆయన సిక్కిం పర్యటన నించి ఢిల్లీ తిరిగి వచ్చీ, రాగానే మాకు తగిన సమయం కేటాయించడం, మిగతా అధికారికంగా జరగవలసిన సాంకేతిక ఏర్పాట్లు సింగపూర్ నించి మా రత్న కుమారుడూ, రాధాకృష్ణుడూ చక, చకా చేసేశారు. మరి ఉపరాష్ట్రపతి అంతటి స్థాయి ఉన్న వారికి వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా గురించి అతి తక్కువ

సమయంలో తెలియాలీ అంటే ఎలా...అనుకోగానే రాధిక మంగిపూడి రంగంలోకి దిగి తన వ్యాఖ్యానంతో రూపొందించిన వీడియోని ఉన్నత స్థాయిలో రాధాకృష్ణ ప్రసారానికి తయారు చేశాడు.

ఈ ఆవిష్కరణ కార్యక్రమ మొత్తం కేవలం 30 నిమిషాలు. ఆ వీడియోని ఈ క్రింది లింక్ లో చూడవచ్చును. (You Tube Channel of Vanguri Foundation) అందులోనే గత 27 ఏళ్ల వంగూరి ఫౌండేషన్ ప్రస్థానం వీడియో కూడా ఉంటుంది.

https://www.youtube.com/watch?v=CFgc_4SEzFk&t=808s

ఆవిష్కరణ కార్యక్రమం అవగానే ఉపరాష్ట్రపతి గారి కార్యాలయం నుంచి వెలువడిన అధికారిక పత్రికా ప్రకటనలో ఈ క్రింది అంశాలని ప్రధానం'గా ప్రస్తావించి, ఆయన ప్రసంగం పూర్తి వివరాలు, ఫోటోలు ఇవ్వడం నాకు భలే నచ్చింది.

* అందరికీ అందుబాటులోకి వచ్చే విధంగా సాహిత్య పునరుజ్జీవం జరగాలి – ఉపరాష్ట్రపతి
* భాష, సంస్కృతుల అభివృద్ధి, పరిరక్షణ కోసం తెలుగువారంతా చొరవ తీసుకోవాలి
* మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన పదసృష్టి జరగాలి
* తెలుగు భాషా వ్యాప్తికి అంతర్జాల మాధ్యమం ఓ మంచి అవకాశం
* దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.
* సాహిత్యం, సంస్కృతుల వ్యాప్తి కోసం తెలుగు సంస్థల చొరవ మరింత పెరగాలి.
* వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి 100వ పుస్తకాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి

నిజానికి ఆయన తన ప్రసంగంలో వంగూరి ఫౌండేషన్ పేరు పదే, పదే ప్రస్తావించడం నాకే ఆశ్చర్యం కలిగించింది. ఆనందం వేసింది. అంతే కాదు. తెలుగు నాట ఈనాడు, ఈక్షణం, మా గల్ఫ్, సాక్షి, తెలుగు టైమ్స్, ఆంధ్రజ్యోతి, NT న్యూస్ మొదలైన పత్రికలు ఈ వార్తని చాలా ఫొటోలతో.. ప్రముఖంగా ప్రచురించడం ఒక ఎత్తు అయితే 24 గంటలూ వార్తలు ప్రసారం చేసే వాటిల్లో కంటే ఈటీవీ ప్రైమ్ టైమ్ లో ఈ ఆవిష్కరణని ఒక వార్తగా ఎంపిక చేసి ప్రసారం చెయ్యడం నాకు నిజంగానే భలే సంతోషం గా ఉంది. ఆ లింక్, ఒకటి, రెండు పత్రికల కథనాలూ లింక్ లూ ఈ క్రింద ఇచ్చాను.

ETV: Prime Time News

https://www.youtube.com/watch?v=vTH8DewRoc8

https://www.youtube.com/watch?v=da4C-BqsNuw

https://www.eenadu.net/nri/newsarticle/general/1101/121219650


https://andhrajyothy.com/telugunews/vice-president-of-india-vanguri-foundation-of-america-book-launch-mrgs-nri-1921102507574096

ఈ అనుకోని గుర్తింపు సభ ఫోటోలు కొన్ని ఇక్కడ జతపరిచాను. ఇంత సొంత సుత్తి అవసరమా అంటే ఏమో, నాకేం తెలుసూ? మీరే చూసి చెప్పండి.




వంగూరి ఫౌండేషన్ అఫ్ అమెరికా 100వ తెలుగు గ్రంథ ఆవిష్కరణ మహోత్సవం





**COMMENTS**